మేమింతే... ఫ్లెక్సీలకు ముసుగులేస్తాం..!

- ఎన్నికల కోడ్ అమలులో ప్లానింగ్ సెక్రటరీల పక్షపాతం
- టీడీపీ ఫ్లెక్సీలు తొలగించకుండా ముసుగులు వేసిన సిబ్బంది
- ఇదేంటని అవాక్కవుతున్న మధురవాడ ప్రాంత ప్రజలు
- టీడీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్న సచివాలయ సిబ్బంది


వైఎస్సార్ కాలనీ వార్డు సచివాలయం గోడపై టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు


ఆ ఫ్లెక్సీలు పూర్తిగా తొలగించకుండా... ఇలా ముసుగులు వేశారంతే...

మధురవాడ : ఎన్నికల కోడ్ అమలు చేయాల్సి వస్తే... ఎక్కడైనా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తారు... ఫ్లెక్సీలు, కటౌట్లు పూర్తిగా తొలగించేస్తారు. మధురవాడ ప్రాంతంలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ అందరినీ షాక్‌కు గురి చేస్తున్నారు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు. అసలేం జరిగిందంటే... ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి నాలుగు రోజులు దాటినా జీవీఎంసీ 5వ వార్డు వైఎస్సార్ కాలనీలోని సచివాలయ గోడలపై వున్న టీడీపీ ఫ్లెక్సీలు నేటికీ తొలగించలేదు. విగ్రహాలకు ముసుగులు కూడా వేయలేదు. ఈ కాలనీతో పాటు జీవీఎంసీ 5, 6, 7 వార్డుల్లో ఎన్నికల కోడ్ అమలులో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై సాక్షితోపాటు ఇతర పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. అయినా స్థానిక సిబ్బంది, ఉన్నతాధికారులు కనీసం పట్టించుకోలేదు. ఎన్నికల కోడ్ అమలు విషయంలో కొందరు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు పరిధులు దాటి టీడీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని... వీరికి విధి నిర్వహణ కంటే టీడీపీ భక్తే ఎక్కువైపోతోందని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ ఫ్లెక్సీల తొలగింపు విషయం సోషల్ మీడియాలో మంగళవారం వైరల్ కావడంతో జోనల్ కమిషనర్ శైలజావల్లిని సాక్షి రిపోర్టర్ వివరణ కోరారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది... ఆగమేఘాల మీద ఫ్లెక్సీలు తొలగించకుండా వాటికి వస్త్రాలతో ముసుగులు వేశారు. ఎక్కడైనా విగ్రహాలకు ముసుగులు వేసి... ఫ్లెక్సీలు పూర్తిగా తొలగించేస్తారు. ఇక్కడి సిబ్బంది మాత్రం స్వామి భక్తి ప్రదర్శిస్తూ ఫ్లెక్సీలకు ముసుగులు వేసి... ఎన్నికల కోడ్ అమలుకు కొత్త భాష్యం చెప్పారని స్థానికులు అవాక్కవుతున్నారు.

వైఎస్సార్ సీపీ జెండా దిమ్మ ధ్వంసం

వైఎస్సార్ కాలనీలో సచివాలయం ఎదురుగా వున్న వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మను ప్లానింగ్ సెక్రటరీ ధ్వంసం చేయించారని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంకర అప్పారావు మీడియాకు తెలిపారు. వాస్తవానికి ఈ దిమ్మకు వైఎస్సార్ సీపీ రంగులుకానీ, జెండా కానీ లేవని... అయినప్పటికీ దిమ్మను ధ్వంసం చేశారని మండిపడ్డారు. అధికార పార్టీ ఫ్లెక్సీలు తొలగించడం చేతకావడం లేదని, వివక్షపూరితంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.


వైఎస్సార్ కాలనీలో ధ్వంసం చేసిన వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మ

ఐఐఎఫ్ఎల్ బ్రాంచి ముందు ఖాతాదారుల ఆందోళన

తగరపువలస : ఇండియా ఇన్ఫోలైన్ ఫైనాన్స్ కంపెనీ (ఐఐఎఫ్ఎల్) తగరపువలస బ్రాంచి ముందు ఖాతాదారులు మంగళవారం ఆందోళనకు దిగి తాళాలు తెరవనీయకుండా అడ్డుకున్నారు. ఈ బ్రాంచిలో 18 మంది ఖాతాదారులు తమ బంగారు ఆభరణాలు తనఖా పెట్టి గతంలో రుణాలు తీసుకున్నారు. ఏడాది క్రితం ఇదే బ్రాంచిలో పని చేసే ఒక ఉద్యోగి ఖాతాదారుల ఆభరణాలను మరో ఫైనాన్స్ కంపెనీలో తనఖా పెట్టి పెద్ద మొత్తంలో డబ్బులు సొంతానికి వాడుకున్నాడు. విషయం తెలుసుకున్న ఖాతాదారులు పలుమార్లు బ్రాంచ్‌కు వెళ్లి తమ ఆభరణాలు లేదా అందుకు సరిపడా నగదు ఇవ్వాలని కోరుతున్నా రేపు మాపు అంటూ తిప్పుతున్నారు తప్ప సమస్య పరిష్కరించడం లేదు. ఏడాదైనా తమ ఆభరణాలు రికవరీ చేయకపోవడంతో ఖాతాదారులు బ్రాంచి ముందు మంగళవారం ఆందోళన నిర్వహించారు. బ్రాంచి సిబ్బంది ఖాతాదారులకు నచ్చజెపుతూ న్యాయపరమైన అడ్డంకుల వల్ల ఇప్పటి వరకు క్లెయిమ్ చేయలేనట్టు తెలియజేశారు. చివరకు బ్రాంచి సిబ్బంది, ఖాతాదారులు భీమిలి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐ డి.రమేష్ అందుబాటులో లేకపోవడంతో ఖాతాదారులు తమ ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. ఖాతాదారుల ఇబ్బందులను ఉన్నతాధికారులకు నివేదిస్తామని బ్రాంచ్ సిబ్బంది తెలిపారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ సమావేశం నేడు

తగరపువలస : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆనందపురం మండలం బోయపాలెంలోని పైడా కళాశాల ఎదురుగా గల ఈట్స్ అండ్ ట్రీట్ ఫంక్షన్ హాలులో వైఎస్సార్‌సీపీ సమావేశం నిర్వహించనున్నారు. భీమిలి నియోజకవర్గానికి సంబంధించిన ముఖ్య నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు హాజరుకావాలని పార్టీ ఆనందపురం, భీమిలి మండలాల అధ్యక్షులు బంక సత్యం, గాడు శ్రీను కోరారు. ఈ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు.

ఆంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురవాడ : జాతరగట్టు చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో పంచముఖ ఆంజనేయ స్వామికి మంగళవారం అర్చకులు పట్నాల రాంబాబు శర్మ, అజయ్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమలాకర్, ప్రమీలాదేవి కుటుంబ సభ్యుల సహకారంతో ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పిళ్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, పిళ్లా రమణ, పిళ్లా అప్పన్న పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎంఈవో రమణ

పద్మనాభం : పాఠశాలల్లో ఈ నెల 8న ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని ఎంఈవో పి.రమణ సూచించారు. ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణపై హెచ్ఎంలకు మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ వివాదాలకు తావులేకుండా ఈ ఎన్నికలు నిర్వహించాలన్నారు. పారదర్శకంగా ఎన్నికలు జరపాలని తెలిపారు. మండలంలోని 49 ప్రాథమిక, రెండు ప్రాథమికోన్నత, తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా విద్యాలయంలో తప్పనిసరిగా ఎన్నికలు జరిపాలని తెలిపారు. సమావేశంలో సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

మత్స్యకార నాయకుడు మృతి


బడే చిన్నారావు (ఫైల్)

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటకు చెందిన మత్స్యకార నాయకుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బడే చిన్నారావు (61) మంగళవారం అనారోగ్య సమస్యతో మృతి చెందారు. సోమవారం రాత్రి ఆరోగ్యం క్షీణించడంతో రుషికొండలో గల ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఈయన మృతి పట్ల కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, మత్స్యకార నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

తల్లి పాలే బిడ్డలకు అమృతతుల్యం


గర్భిణులు, బాలింతలకు బాల సంజీవని కిట్లు పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పద్మనాభం : తల్లి పాలే బిడ్డలకు అమృత తుల్యమని అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభావతి, లీలావతి అన్నారు. మండలంలోని మద్ది గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టిన బిడ్డలకు తల్లి పాలు శ్రేష్టకరమన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు బాల సంజీవని కిట్లు పంపిణీ చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ప్రయోజనాలు


ప్రకృతి సాగులో ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న పూర్వ విద్యార్థులు

తగరపువలస : ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు ఆనందపురం మండలం తర్లువాడలోని ప్రకృతి వ్యవసాయాన్ని మంగళవారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు ఎలాంటి లాభాలు కలుగుతున్నాయో నేరుగా రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం రీజినల్ అధికారి ప్రకాష్ మాట్లాడుతూ పీఎండీఎస్ పద్ధతిలో సాగు చేయడం వల్ల భూమికి, రైతులకు కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్‌రావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు సర్టిఫికెట్లు అందిస్తామని, దీనివల్ల వారికి అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎరువులు, కషాయాలు ఏ విధంగా తయారు చేస్తారో చేసి చూపించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు, ప్రతినిధి జొన్నాడ వఫీర, తర్లువాడ యూనిట్ ఇన్‌చార్జి రామారావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందనలు


విజేతలను అభినందిస్తున్న సురేష్ తదితరులు

మధురవాడ : రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో మధురవాడకు చెందిన పలువురు క్రీడాకారులు ప్రతిభ చూపారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈ నెల 2, 3, 4 తేదీల్లో నిర్వహించిన సబ్ జూనియర్, క్యాడెట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో విశాఖ జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. సబ్ జూనియర్ విభాగంలో హర్షవర్ధన్, సుదీర్, గాయత్రి, శుభం మహారాణా, ఆకాన్షా మాలిక్, క్యాడెట్ విభాగంలో జస్వంత్ సాయి సూర్య, ధనలక్ష్మి, బాషిత, నిత్య, జ్ఞానసిరి బంగారు పతకాలు, పట్టు శ్రీకర్ రోహిత్‌కుమార్, గుణ కీర్తి రజత పతకాలు సాధించగా దీపక్ కాంస్య పతకం సాధించాడు. విజేతలను మంగళవారం మధురవాడలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకనక దుర్గా సప్లయర్స్ అండ్ క్యాటరింగ్స్ ప్రొప్రైటర్ కొర్రాయి సురేష్, యూత్ తైక్వాండో కోచ్ మాకాన సురేష్, రాష్ట్ర అధ్యక్షుడు పి.అచ్యుతరెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అచ్చింనాయుడు అభినందించారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులకు కష్టాలు

- గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులకు ఇబ్బందులు
- ఎనీ టైమ్ బిల్లు పేమెంట్ యంత్రం ఏర్పాటు చేస్తే ఉపశమనం


మధురవాడ విద్యుత్ కార్యాలయంలో ఎనీటైమ్ పేమెంట్ మిషన్


చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్

తగరపువలస : గ్రామీణ ప్రాంత ప్రజలు, నిరక్షరాస్యులు, కీ ప్యాడ్ ఫోన్ వినియోగదారులను విద్యుత్ బిల్లుల చెల్లింపు కష్టాలు వెంటాడుతున్నాయి. రెండు నెలల క్రితం వరకు వినియోగదారులు తమ బిల్లులను ఫోన్ పే యాప్ ద్వారా చెల్లించేవారు. దీని కోసం యాప్ నిర్వాహకులు సర్వీస్ చార్జీలు వసూలు చేసేవారు. గత నెల నుంచి ఈ యాప్ ద్వారా చెల్లింపులు నిలిపివేశారు. ఈస్టన్ పవర్ యాప్ ద్వారా బిల్లుల చెల్లింపులకు అవకాశమిచ్చారు. ఈ యాప్ ఇన్‌స్టాలేషన్, దీని ద్వారా చెల్లింపులు తేలికే అయినప్పటికీ... చాలా మందికి అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత, ఆండ్రాయిడ్ ఫోన్లు లేకపోవడం ఇబ్బందిగా మారింది. ప్రైవేట్ మీ సేవా కేంద్రాల నిర్వాహకులు విద్యుత్ బిల్లులు తీసుకోకపోవడం, సచివాలయాల ద్వారా బిల్లుల చెల్లింపులకు వినియోగదారులు అలవాటు పడకపోవడం ప్రధాన సమస్యగా కనిపిస్తోంది.

సబ్‌స్టేషన్ల చుట్టూ వినియోగదారులు..

విద్యుత్ బిల్లుల చెల్లింపు అర్థం కాని వినియోగదారులు సబ్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నా బిల్లు కలెక్టర్లు లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు. నగరంలోని మధురవాడ, గోపాలపట్నం, సీతమ్మధార వంటి ప్రధాన విద్యుత్ కేంద్రాల్లోలాగా... వినియోగదారుల సౌకర్యార్థం 24 గంటలు అందుబాటులో ఉండే ఎనీ టైమ్ బిల్లు పేమెంట్ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు. ఈ యంత్రం నగదు, కార్డు, చెక్కుల ద్వారా చెల్లింపులు స్వీకరిస్తుంది. అయితే అన్ని రకాల విద్యుత్ బిల్లులను ప్రైవేట్ మీ సేవా కేంద్రాలు, అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో స్వీకరించాలని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. లేదంటే ప్రతీ నెల 13, 16న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బిల్లు కలెక్టర్లు అందుబాటులో ఉంటారన్నారు. 94409 03783 ద్వారా సమాచారం తెలుసుకుని ఆయా రోజుల్లో నేరుగా సబ్ స్టేషన్‌కు వచ్చి వినియోగదారులు బిల్లులు చెల్లించవచ్చని అధికారులు చెబుతున్నారు.

భీమిలి డివిజన్‌లో పరిస్థితి ఇదీ...

ప్రాంతం	వినియోగదారులు
చిట్టివలస టౌన్	20,000
చిట్టివలస రూరల్	12,000
భీమునిపట్నం	16,000
ఆనందపురం మండలం	25,000
పద్మనాభం మండలం	20,000

బిల్లు చెల్లింపు యంత్రం ఏర్పాటు చేయాలి



చిట్టివలస కేంద్రంగా సబ్ స్టేషన్‌లో వినియోగదారులకు అందుబాటులో విద్యుత్ బిల్లుల చెల్లింపుల యంత్రాన్ని ఏర్పాటు చేయాలి. అలాగే ప్రైవేట్ మీ సేవ కేంద్రాలు, అన్ని సచివాలయాల్లో బిల్లుల చెల్లింపులపై అవగాహన కల్పించాలి.

– చిల్ల సూర్యనారాయణ రెడ్డి, వలందపేట

బిల్లు కలెక్టర్‌ను అందుబాటులో ఉంచాలి



విద్యుత్ బిల్లులు చెల్లించడానికి చాలా మంది వద్ద స్మార్ట్ ఫోన్లు లేవు. దీంతో బిల్లులు చెల్లించడం పెద్ద సమస్యగా మారింది. ప్రత్యామ్నాయంగా రోజూ బిల్లు కలెక్టర్ ఒకచోట ఉంటే బిల్లుల చెల్లింపు తేలిక అవుతుంది. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– బొడ్డు నరసింగరావు, కొండపేట

నిలువెత్తు నిర్లక్ష్యం

- కార్‌షెడ్ జంక్షన్, వుడా కాలనీలో ప్రమాదకరంగా ఫుట్‌పాత్‌లు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
- వాటిపై ట్రాఫిక్ స్టాపర్లతో కప్పుతున్న స్థానికులు


పాత పీఎంపాలెం సమీపంలో రక్షణ లేని శ్లాబుపై పెట్టిన స్టాపర్


వుడా కాలనీ రోడ్డు జంక్షన్ సమీపంలో ఇదీ పరిస్థితి

మధురవాడ : జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధాన జంక్షన్లలోని ఫుట్‌పాత్‌ల నిర్వహణను గాలికి వదిలేయడంతో భయంకరంగా మారాయి. నిత్యం ఎంతో రద్దీగా వుండే కార్‌షెడ్ జంక్షన్‌లో సుమారు రెండు వందల మీటర్ల పరిధిలో పలుచోట్ల ఫుట్‌పాత్‌పై శ్లాబు పగిలిపోయి అత్యంత ప్రమాదకరంగా తయారైంది. కింద భారీ కాలువ వుండడంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా అందులోకి జారిపడి కొట్టుకుపోయే ప్రమాదం పొంచి వుంది. కొన్నిచోట్ల అంతో ఇంతో బాగున్న ఫుట్‌పాత్‌లను దుకాణదారులు ఆక్రమించేస్తున్నారు. దీంతో పాదచారులు ఫుట్‌పాత్‌పై సురక్షితంగా నడిచే పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. ఫుట్‌పాత్‌పై తరచూ ప్రమాదాలు చోటు చేసుకోవడంతో చాలా మంది పాదచారులు రోడ్లపైనే నడుస్తూ రాకపోకలు సాగిస్తున్నారు. కొన్నిచోట్ల శ్లాబులు పగిలిన ఫుట్‌పాత్‌లపై స్థానికులే పాడైపోయిన స్టాపర్లు, కట్టెలు అడ్డంగా పెట్టి రక్షణ కల్పిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లను రాకపోకలకు వీలుగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.


కార్‌షెడ్ కూడలిలోని సిగ్నల్ పాయింట్ వద్ద ఇలా...

ముకుందపురంలో రికార్డుల పరిశీలన


ముకుందపురంలో రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీవో హుస్సేన్

తగరపువలస : ఆనందపురం మండలం ముకుందపురంలో భీమిలి ఇన్‌చార్జి ఆర్డీవో హుస్సేన్ మంగళవారం పర్యటించారు. సాగుభూమిని వ్యవసాయేతర పనులకు వినియోగిస్తున్నట్టు కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్డీవో పర్యటించినట్టు తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న భూమిని, సంబంధిత రికార్డులను పరిశీలించారు. కలెక్టర్‌కు నివేదిక అందించనున్నారు. ఆయనతోపాటు ఆర్ఐ మణికంఠ, సర్వేయర్ రాజేష్ ఉన్నారు.

మందుబాబులకు జరిమానా

తగరపువలస : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 8 మందికి మంగళవారం భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ప్రమాదాలకు గురికావొద్దని సూచించారు.

వేలం పాట వాయిదా

భీమునిపట్నం : భీమిలిలోని దేవాదాయ శాఖకు సంబంధించిన శ్రీగంధం రామస్వామి సత్రం స్థలం వేలం పాట వాయిదా పడిందని కార్యనిర్వాహక అధికారి బొంగరాల మురళీమోహన్ మంగళవారం తెలిపారు. ఇక్కడ టీఎస్ నంబర్ 144లో 14 సెంట్ల ఖాళీ స్థలం వుందని, అద్దె చెల్లించి ఆ స్థలం వినియోగించుకునేందుకు బహిరంగ వేలం వేయడానికి నిర్ణయించామని తెలిపారు. ఈ నెల 7న నిర్వహించాల్సిన వేలం పాటను అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని... త్వరలో మళ్లీ వేలం తేదీ ప్రకటిస్తామని తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో రాస పోలమాంబ



తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం గన్నేరు, నందివర్ధనం, జరపర పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం కొండరాజుపేటకు చెందిన బడ్డెపు పోలిరెడ్డి, కంద్రెడ్డి అప్పలరాజు ఆర్థిక సాయంతో అలంకరణ పూర్తి చేశారు. భక్తులకు తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు అనుకూల విద్య బోధించాలి


ఆనందపురం హైస్కూల్‌లో విద్యార్థులను పరీక్షిస్తున్న డీఈవో చంద్రకళ

తగరపువలస : విద్యార్థులకు అనుకూలంగా ఉపాధ్యాయులు బోధించాలని డీఈవో చంద్రకళ సూచించారు. మంగళవారం ఆమె ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ముందుగా 6వ తరగతి చదువుతున్న విద్యార్థులను పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు రీడింగ్, రైటింగ్‌తోపాటు చతుర్విధ ప్రక్రియలపై బోధించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి నిధులు అవసరమని ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ ఆమె దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో గంగరాజు, ఉపాధ్యాయులు భాస్కరరావు, ముత్యాలనాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డులో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎంఎస్‌జీ ఫెబల్స్ ఈవెంట్స్‌లో గోపాలపట్నం ప్రాంతానికి చెందిన రామరాజేష్ (22) పని చేస్తున్నాడు. బీచ్ రోడ్డు తొట్లకొండ ఎదురుగా బేవాచ్ పార్కులో ఈవెంట్ నిర్వహణకు పువ్వుల డెకరేషన్ నిమిత్తం సోమవారం ఇక్కడకు చేరుకున్నాడు. పనికి చేరినప్పుడే నెలకు రూ. 20 వేలు జీతం ఇస్తామంటూ ఈవెంట్స్ ఆర్గనైజర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే సోమవారం రాత్రి జీతం రూ. 20 వేలు కాకుండా రూ.10 వేలు మాత్రమే ఇవ్వడంపై ఆర్గనైజేషన్ సిబ్బందితో రామరాజేష్ వివాదానికి దిగాడు. తెల్లవారుజామున చూసేసరికి డెకరేషన్ క్లాత్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదిలా ఉండగా యువకుడి ఆత్మహత్యపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి స్నేహితులకు వీడియో కాల్ చేసి చనిపోతానని చెప్పాడని ఇక్కడ ఉన్న సిబ్బంది చెబుతుంటే... మానసిక పరిస్థితి సరిగాలేక ఉరి వేసుకున్నాడని కొందరు అంటున్నారు. ఈవెంట్ నిర్వహణకు సుమారు 10 మంది వస్తారని... అయితే రామరాజేష్ ఈవెంట్ రూమ్‌లో ఉరి వేసుకుంటే మిగతా సిబ్బంది ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆత్మహత్యా..? లేక వేరేమైనా జరిగిందా అని పోలీసులు నిర్ధారించాల్సి వుంది. మృతుని తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ డి.రమేష్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం


కాలిపోతున్న పూరి గుడిసె

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస పంచాయతీకి చెందిన బోని త్రినాథరావు, రాజేశ్వరి దంపతులకు చెందిన పూరి గుడిసె మంగళవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలి బూడిదయింది. స్థానిక యువకులు సకాలంలో స్పందించి సహాయం చేయడంతో ప్రాణాపాయం తప్పింది. వెంటనే తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. సమీపంలోని గడ్డి కుప్పకు కూడా మంటలు వ్యాపించడంతో సిబ్బంది ఆర్పారు. ఈ ప్రమాదంలో బాధిత కుటుంబానికి రూ.30 వేల వరకు నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఆ కుటుంబానికి స్వచ్ఛంద సంస్థలు అండగా నిలివాలని పలువురు కోరుతున్నారు.

కలుషిత నీటితో వ్యాధులు


సురక్షిత నీరు తాగాలని ర్యాలీ నిర్వహిస్తున్న తాళ్లవలస హైస్కూల్ విద్యార్థులు

తగరపువలస : కలుషిత నీరు తాగడం వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ సురక్షిత నీరే తాగాలని కోరుతూ జల్ జీవన్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ ఆనంద్ సూచించారు. భీమిలి మండలం తాళ్లవలస హైస్కూల్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నీటి నమూనాలు సేకరించి, పరీక్షలు జరిపి వివరాలు తెలియజేశారు. డయేరియాను అరికట్టడం, చేతులు శుభ్రం చేసుకోవడంపై విద్యార్థులకు వివరించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.